లాటరీ తగిలిందని రూ.38లక్షలు కొట్టేశారు

- సైబర్ నేరగాళ్ల వలలో చిక్కిన నూజెళ్ల వాసి
- ఏడాది వ్యవధిలో విడతల వారీగా నగదు బదిలీ
- పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి..



గుడివాడ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి ఓ వ్యక్తి రూ.38 లక్షలు పోగొట్టుకున్న ఘటన మండలంలో వెలుగు చూసింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుడివాడ మండలం నూజెళ్ల గ్రామానికి చెందిన దాసరి హరి గంగాధర్‌కు 2024, జూన్ 13వ తేదీన దుబాయ్ ఫౌండేషన్/దుబాయ్ ఇస్లామిక్ బ్యాంకు పేరుతో ఫోన్ సందేశం వచ్చింది. ఆ సందేశంలో గవర్నమెంట్ ఆఫ్ దుబాయ్ లాటరీలో రూ.1.86 కోట్లు గెలుచుకున్నట్లు ఉంది. లాటరీలో గెలిచిన మొత్తం రావాలంటే కొంతమేర ఖర్చు అవుతుందని, తమ బ్యాంకు ఖాతా, ఫోన్‌పేలకు నగదును పంపాలంటూ సందేశాలు పంపించారు. కోట్లాది రూపాయల లాటరీ తగిలిందనే ఆనందంతో గంగాధర్ వచ్చిన సందేశాలపై ఎటువంటి ఆరా తీయకుండా, వారు చెప్పిన విధంగా రూ.5 వేల నుంచి రూ.3 లక్షల వరకు విడతల వారీగా వారి ఖాతాలకు ఏడాదిగా రూ.38 లక్షలు చెల్లించాడు. నెల రోజుల క్రితం మళ్లీ రూ.1.85 లక్షలు చెల్లించాలని సైబర్ నేరగాళ్లు కోరడంతో, అనుమానం వచ్చి తాను మోసపోయినట్లు గ్రహించి గుడివాడ రూరల్ పోలీసులను బాధితుడు ఆశ్రయించాడు. సెక్షన్ 420, ఐ.టి యాక్టు కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపారు.

మళ్లీ మట్టి దందా

కూటమి ప్రభుత్వంలోనూ చెలరేగుతున్న వైసీపీ మాఫియా

పోలవరం కుడి కాల్వకట్ట వెంబడి మట్టిపై మళ్లీ వైసీపీ గద్దల కన్నుపడింది. ఇసుక అక్రమ దందాలో ఆరితేరిన మాజీమంత్రి కొడాలి నానీకి సన్నిహితమైన ఓ సంస్థ, ఆయన అనుచరులు ఈ దారుణాలకు పాల్పడుతున్నారు. పోలవరం కుడికాల్వ కట్ట మట్టిని అక్రమంగా తరలించుకుపోతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ తవ్వకాలపై ఇటీవలే విజిలెన్స్ విచారణ జరగ్గా, మళ్లీ అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. కూటమి ప్రభుత్వంలోనే కాంట్రాక్టులను పొంది యథేచ్ఛగా విక్రయించుకుంటున్నారు.



పోలవరం కాల్వ వద్ద తవ్వకాలు

- పోలవరం కాల్వగట్టును తవ్వేస్తున్న కొడాలి నాని అనుచరులు
- ఇసుక అక్రమ దందాలో ఆరితేరిన సంస్థ నిర్వాకం
- బుడమేరు కట్ట పనుల పేరిట అనుమతులు
- పాతపాడులోని రియల్ వెంచర్‌కు మట్టి తరలింపు
- నానాటికీ ప్రమాదకరంగా మారుతున్న కాల్వకట్ట

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రభుత్వం మారినా వైసీపీ అక్రమార్కుల మట్టి దోపిడీ మాత్రం ఆగట్లేదు. వైసీపీ నేత, మాజీమంత్రి కొడాలి నానీకి అత్యంత సన్నిహితంగా ఉండే ఓ కంపెనీ ఇటీవల మళ్లీ రంగంలోకి దిగింది. అనుమతులు ఉన్నాయన్న పేరుతో విజయవాడ రూరల్ మండల పరిధిలోని పోలవరం కుడికాల్వ వెంబడి అడ్డగోలుగా మట్టిని తవ్వేస్తున్నారు. భారీ ఎత్తున తవ్వకాలు జరుగుతున్నా యంత్రాంగం పట్టించుకోవట్లేదు. మొదట్లో అనుమతులు ఉన్నాయని బుకాయించారు. ఆ తర్వాత ఎలాంటి అనుమతులు లేవని వెలుగుచూసింది. కాల్వగట్టు వెంబడి మట్టితో పాటు కొండ దిగువన గ్రావెల్‌నూ తవ్వేస్తున్నారు. దీనివల్ల ఈ ప్రాంతమంతా గోతులమయంగా మారింది. పోలవరం కట్టకు కూడా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఏర్పడింది. కట్ట కుంగితే, గోతుల వెంబడి పోలవరం నీరు పొలాలను ముంచెత్తే ప్రమాదం ఉంది. కట్ట తెగితే విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలోని గ్రామాలకు ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతుంది. కాగా, కొత్తూరు రిజర్వు ఫారెస్టులోకి కూడా వెళ్లి గ్రావెల్ మట్టిని అక్రమంగా తవ్వేస్తున్నారు.

బుడమేరు కట్టరోడ్డు పనుల పేరుతో తవ్వకాలు

బుడమేరు కట్టరోడ్డు పేరు చెప్పి ఈ సంస్థ పోలవరం కట్ట వెంబడి మట్టిని తోడేస్తోంది. కవులూరు నుంచి ఇబ్రహీంపట్నం థర్మల్ పవర్ స్టేషన్ వరకు జరుగుతున్న బుడమేరు కాల్వగట్టు పనులకు మట్టి వేయటానికి అని చెప్పి పెద్దసంఖ్యలో లారీల్లో తరలిస్తున్నారు. కాల్వగట్టుపై పలుచోట్ల ఎక్స్‌కవేటర్లు పెట్టి తవ్వుతున్నారు. ఈ కట్ట మీదుగానే లారీలు బుడమేరు కట్టకు చేరుకుని మట్టిని నింపుతున్నాయి. పగటి సమయంలో బుడమేరు కట్టరోడ్డుకు, రాత్రిపూట పాతపాడులోని శ్రీసిటీకి మట్టిని తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతున్నా, ఇరిగేషన్, ఫారెస్ట్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులకు స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవట్లేదు. కొడాలి నానీకి అత్యంత సన్నిహితమైన కంపెనీ, ఆయన అనుచరులకు ఈ పనులు చేసుకునే అవకాశం ఎలా వచ్చిందన్నది ప్రశ్నార్థకంగా మారింది. బుడమేరు పనుల కాంట్రాక్టును ఎలా పొందారన్నది చర్చనీయాంశమైంది. అత్యవసర పనులు కావటంతో నామినేషన్ విధానంలో అప్పగించినట్టు తెలుస్తోంది.

ఓం శక్తి



- దసరా ఉత్సవాల్లో పగటి వేషాలే హైలెట్
- వారితోనే. పండుగ సందడి ప్రారంభం
- శక్తి, భేతాళ, అర్ధనారీ శ్వర, బుడబుక్కల, పిట్టలదొరల విన్యాసాలు

6

- నాటి కళాకారుల అభినయాలకు ప్రజల నుంచి ఆదరణ
- నేడు జీవన మార్పులతో కనుమరుగవుతున్న కళలు

రూ.58.56 లక్షలు గోల్‌మాల్!



ఉంగుటూరు మండలంలోని పొట్టిపాడు, పెదఅవుటపల్లి, ఎన్ అప్పారావుపేట పంచాయతీల్లో రూ.58.56 లక్షల నిధులు గోల్‌మాల్ అయ్యాయి. ఇద్దరు పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఎంపీడీవో స్వాహా చేశారు. సామాజిక కార్యకర్త ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అధికారులు విచారణ జరిపి సమగ్ర నివేదిక కలెక్టర్‌కు అందజేశారు. నిధుల దుర్వినియోగం నిర్ధారణ కావడంతో నోటీసులు జారీ చేశారు. పది రోజుల్లో నగదు చెల్లించాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ విషయం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

- ఉంగుటూరు మండలంలో పంచాయతీ నిధుల దుర్వినియోగం
- గత ఎంపీడీవో, ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల నిర్వాకం
- సామాజిక కార్యకర్త ఫిర్యాదుతో డీఎల్‌పీవో విచారణ
- నిర్ధారణ కావడంతో నోటీసులు జారీ చేసిన కలెక్టర్ బాలాజీ
- పది రోజుల్లో నగదు చెల్లించాలని ఆదేశాలు
- లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- ప్రస్తుతం పామర్రు ఎంపీడీవోగా పనిచేస్తున్న జ్యోతి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఉంగుటూరు మండలంలో గతంలో పనిచేసిన ఎంపీడీవో, మరో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. తమకు ఉన్న వెసులుబాటును ఆసరాగా చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా నగదును పక్కదారి పట్టించారు. వివరాల్లోకి వెళితే.. ఉంగుటూరు మండలంలో పరిపాలనాపరంగా ఎలాంటి అనుమతులు లేకుండా పంచాయతీల నిధులను దారి మళ్లించిన అంశంపై సామాజిక కార్యకర్త ఎం.సుబ్రహ్మణ్యం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గుడివాడ డీఎల్‌పీవో స్పందించి మండలంలోని పొట్టిపాడు, పెదఅవుటపల్లి, ఎన్ అప్పారావుపేట పంచాయతీల్లో విచారణ జరిపారు. నిధుల దుర్వి నియోగంపై నివేదికను జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) ద్వారా కలెక్టర్‌కు సమర్పించారు. దీనిపై ఎంపీడీవో, ఇద్దరు పంచాయతీ మిగతా 6లో..

ఎంపీడీవో దారి మళ్లించిన నగదు రూ.29.28 లక్షలు

ఉంగుటూరు ఎంపీడీవోగా కె.జ్యోతి 2019 సెప్టెంబరు నుంచి 2021 ఏప్రిల్ వరకు పనిచేశారు. ఆ సమయంలో పలు పంచాయతీలకు ఆమె ప్రత్యేక అధికారిగా కూడా కొనసాగారు. ఎలాంటి అనుమతులు లేకుండా, తనకు ఉన్న అధికారంతో తన బ్యాంకు ఖాతాకు మొత్తం రూ.29.28 లక్షలను మళ్లించుకున్నట్లు విచారణ అధికారులు నిర్ధారించారు. జ్యోతి బదిలీల్లో భాగంగా ప్రస్తుతం పామర్రు ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. పొట్టిపాడు పంచాయతీ కార్యదర్శిగా 2019 ఆగస్టు నుంచి 2020 అక్టోబరు వరకు పనిచేసిన ఎం.అమీర్‌బాషా, అదే పంచాయతీలో 2020 అక్టోబరు నుంచి 2021 ఆగస్టు వరకు పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన వై.వెంకటేశ్వరరావు రూ.13.35 లక్షల పంచాయతీ నిధులను దారి మళ్లించినట్లు అధికారులు కలెక్టర్‌కు నివేదికను అందజేశారు.

కామన్ సైట్ అక్రమ రిజిస్ట్రేషన్‌పై కదలిక

- ఎల్ఆర్ఎస్‌లో క్రమబద్ధీకరణ చేయవద్దని సీఆర్డీఏ కమిషనర్‌కు పంచాయతీ కార్యదర్శి లేఖ

ఉయ్యూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గండిగుంటలో కామన్‌సైట్ అక్రమ రిజిస్ట్రేషన్‌పై గ్రామపంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. కాటూరు రోడ్డులోని ఓ లే అవుట్‌లో 33 సెంట్లు కామన్ సైట్‌గా చూపించిన కోట్ల విలువైన భూమిని 36వ ప్లాటుగా నిర్వాహకులు ఓ వ్యక్తికి విక్రయించి, ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ నెల 6న రిజిస్ట్రేషన్ చేసిన స్థలాన్ని ఎల్ఆర్ఎస్‌లో క్రమబద్ధీకరించవద్దని కోరుతూ గ్రామపంచాయతీ కార్యదర్శి శుక్రవా రం సీఆర్డీఏ కమిషనర్‌కు లేఖ సమర్పించారు. గ్రామ పంచాయతీ పరిధి కాటూరు రోడ్డులో 258/2, 259/1 సర్వే నంబర్లలో 3.29 ఎకరాల వ్యవసాయ భూమిలో 2008లో లే అవుట్ వేసి 35 ప్లాట్లుగా విభజించారు. అందులో 33 సెంట్ల భూమిని కామన్ సైట్‌గా చూపించి అన్ని ప్లాట్లు విక్రయించారు. లే అవుట్‌లో కామన్ సైట్‌ను గ్రామ పంచాయతీ వారు ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడంతో లే అవుట్ నిర్వాహకులు ఓ వ్యక్తికి అమ్మి రిజిస్ట్రేషన్ చేశారు. దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్ రద్దు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిలా రిజిస్ట్రార్, ఇతర అధికారులకు గ్రామ పంచాయతీ కార్యదర్శి కుమార్ నివేదిక అందజేశారు.

జిల్లా న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ

మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వి.విద్యాసాగర్ నాయుడు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రజలకు సత్వరన్యాయం అందించే దిశగా న్యాయవ్యవస్థ, భద్రతా వ్యవస్థలు పరస్పర సహకారంతో సమర్థ వంతంగా పనిచేయాలని ఇరువురు అభిప్రాయపడ్డారు. న్యాయశాఖకు పోలీసు శాఖకు ఉన్న సంబంధ బాంధవ్యాలు మరింత మెరుగుపడాలని, బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం అందించేలా పోలీసు శాఖ తరఫున కృషి చేస్తానని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు.




మచిలీపట్నంలో ఉద్రిక్తత



పోలీసులను తోసుకుంటూ మెడికల్ కాలేజి వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న వైసీపీ శ్రేణులు

- ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయవద్దంటూ వైసీపీ ఆధ్వర్యంలో ర్యాలీ
- అనుమతిలేదని అడ్డుకున్న పోలీసులు
- వాగ్వాదానికి దిగిన వైసీపీ నేతలు పేర్ని, కైలా, సింహాద్రి, దేవినేని
- వైసీపీ శ్రేణులు, పోలీసుల మధ్య తోపులాట

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయవద్దంటూ మచిలీపట్నంలో వైసీపీ నాయకులు శుక్రవారం నిర్వహించిన ర్యాలీ తోపులాటలు, వాగ్వాదాలతో ఉద్రిక్తతకు దారి తీసింది. వైసీపీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు తొలుత భాస్కరపురం గాడెల్లి డేవిడ్ ఇంటి నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు మెడికల్ కళాశాల వరకు ర్యాలీగా బయలుదేరారు. వారు వెళ్లకూడదని పోలీసు ఆంక్షలు విధించారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు. కళాశాలలో పరీక్షలు జరుగుతున్నందున కళాశాల వద్ద ఆందోళన చేయవద్దని హెచ్చరికలు జారీ చేశారు. పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి వస్తున్న దేవినేని అవినాష్ కారును అడ్డుకున్నారు. అవినాష్ మూడు స్తంభాల సెంటర్ నుంచి కాలినడకన భాస్కరపురానికి వెళ్లారు. పోలీసుల ఆంక్షలను లెక్క చేయకుండా మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యేలు సింహాద్రి రమేష్, కైలే అనిల్‌కుమార్, మొండితోక జగన్మోహనరావు, బందరు నియోజకవర్గం ఇన్‌చార్జి పేర్ని కిట్టు, పెడన నియోజక వర్గం ఇన్‌చార్జి ఉప్పాల రాము, మాజీ మేయర్ మిగతా 6లో..



కౌంట్‌డౌన్ 2

ఓం శక్తి

దసరాలో పగటి వేషాలే హైలెట్

- పగటి వేషాలతోనే.. 'దసరా' సందడి ప్రారంభం
- శక్తి, భేతాళ, అర్ధనారీశ్వర, బుడబుక్కల, పిట్టలదొరల విన్యాసాలు
- నాటి కళాకారుల అభినయాలకు ప్రజల నుంచి ఆదరణ
- నేడు జీవన మార్పులతో కనుమరుగవుతున్న పగటివేషగాళ్లు
- అంతరించిపోతున్న కళా సంస్కృతిని కాపాడుకుందాం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ కల్చరల్)

ఒకప్పుడు వీధుల్లో పదులసంఖ్యలో కన్పించే పగటి వేషాలు వేసే కళాకారులు ప్రస్తుతం అక్కడక్కడ ఒకరో, ఇద్దరో కనిపిస్తున్నారు. పగటి వేషాలు అప్పట్లో సంప్రదాయ కళగా ఆదరించే వాళ్లు. ఇప్పుడు కేవలం వారిని డబ్బులు ఆశించే బిక్షగాళ్లుగా భావిస్తున్నారు. ఈ క్రమంలో క్రమేణా పగటి వేషాలు తగ్గుతూ వచ్చాయి. ఓ రకంగా చూస్తే ఈ జానపద కళ అంత రించిపోతోందనే చెప్పాలి. ఇప్పుడు చూద్దామన్నా దసరా పండుగకు పగటి వేషాలు కనిపించడం లేదు. తెలుగు సంస్కృతిలో మాయమౌతున్న పగటివేషాల జానపద కళలను పరిశీలిద్దాం.

చారిత్రక వారసత్వం..

పగటి వేషాల మూలాలు

పగటి వేషాలు జానపద కళారూపంగా శాతవాహనుల కాలం నుంచి ఉన్నాయని హాలుని గాథా సప్తశతి, భరత కోశం వంటి గ్రంథాల్లో పేర్కొన్నారు. పగటిపూట ప్రదర్శనల వల్ల "పగటి వేషాలు"గా పేరు వచ్చింది. కాకతీయుల కాలంలో యుగంధరుడు పిచ్చి యుగంధరుడిగా వేషం ధరించి శత్రువులను జయించిన కథలు ఈ కళ చారిత్రక ప్రాముఖ్యతను తెలియజేస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లోని గడ్డిపాడు వంటి ప్రాంతాలు 60 రకాల వేషాలతో ప్రసిద్ధి చెందాయి. ఇవి పౌరాణిక, హాస్య, నిత్యజీవిత కథలను ప్రదర్శించాయి. రాజు కళింగ గంగు, సంబెట గురవ రాజు వంటి కథలు పండుగల్లో సామాజిక సందేశాలను అందించాయి.

> పూర్వం పండుగల సమయంలో తెలుగునాట గ్రామ వీధులు పగటి వేషగాళ్ల సందడితో కళకళలాడేవి. దసరాకు నెలరోజుల ముందే సంచార కళాకారులు విచిత్ర వేషధారణలతో ఊరూ వాడా తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి తమ హావభావాలతో అలరిస్తూ.. ఆకట్టుకునేవారు. శక్తి, వీర, భేతాళ, గంగిరెద్దులు, అర్ధనారీశ్వర, బుడబుక్కల, పిట్టల దొర తదితర వేషాలతో కళాకారులు ఇంటింటికీ వెళ్లి అభినయం ప్రదర్శించేవారు. విచిత్ర వేషధారణలతో అలరించేవారు. కొందరు పద్యాలు, వ్యంగ్యాలు, హాస్యంతో ప్రజలను ఆనందపరిచేవారు. ధాన్యం, డబ్బులు సంభావనలుగా తీసుకునే ఈ సంప్రదాయం సామాజిక సమస్యలను వినోదపూర్వకంగా చర్చించే వేదికగా ఉండేది.

వేషాల వైవిధ్యం..

సమాజ దర్పణం

పగటి వేషాలను మతపరమైన (శక్తి, హరిదాసు, పకీరు, దేవతారూపాలు), కులపరమైన (గొల్లబోయిడు, బుడబుక్కల), పౌరాణిక (అర్ధనారీశ్వర), జంతు ప్రదర్శన (గంగిరెద్దుల), ఇతర (పిట్టలదొర) రకాలుగా విభజించవచ్చు. దసరాలో శక్తి వేషం చాలా ముఖ్యమైనది. దసరా చివరి రోజున దీనిని ప్రదర్శిస్తారు. పిల్లలు భయపడేవారు. డప్పుల వాయిద్యాల నడుమ శక్తి పరుగులు తీస్తుంటే ప్రజలు భయపడి తలుపులు వేసుకునేవారు. అర్ధనారీశ్వర వేషం మరో ప్రత్యేక ఆకర్షణ. ఒకే వ్యక్తి శివుడు, పార్వతిగా మూడు గంటల మేకప్‌తో ప్రదర్శన ఇస్తాడు. ఈ వేషాలు వీధులు, ఇంటి గడపలను రంగస్థలంగా మార్చి, సంభాషణలు, పద్యాలు, హార్మోనియం, తబలా వాయిద్యాలతో ప్రజలను అలరించాయి. గ్రామాల్లో సంచార కళాకారులు నెలరోజుల పాటు ప్రదర్శనలు ఇచ్చి సంభావన అందుకునేవారు. సమాజంలోని కుల, మత విమర్శలను వ్యంగ్యంగా చూపేవారు.



కనుమరుగయ్యే దశలో..

ఇప్పుడు పండుగల్లో ఈ సందడి కనిపించట్లేదు. ఒకప్పుడు 64 వేషాలు ఉండగా, ఇప్పుడు 32కి తగ్గాయి. అవి కూడా దాదాపుగా కనుమరుగయ్యే దశలో ఉన్నాయి. ఇప్పుడు చెప్పుకోవడానికి అరడజను కూడా కనిపించటం లేదు. టీవీ, సోషల్ మీడియాకు ప్రజలు ఆకర్షితులౌతున్నారు. యువత ఈ కళలు నేర్చుకోవట్లేదు. 'జీవన మార్పులు' కారణమని గడ్డిపాడు కళాకారులు చెబుతారు. బోడి బాపనమ్మ వంటి వేషాలను ప్రజలు తిరస్కరించడం, ఆర్థిక సమస్యలు, పట్టణాల్లో అడ్డంకులు కళాకారులను ఇతర వృత్తులకు మార్చాయి. రెండు దశాబ్దాల క్రితమే చాలామంది దేశంలో ఉన్న పెద్ద పట్టణాలకు వలసలు వెళ్లి సినిమాలలో పనిచేస్తున్నారు. మరికొందరు వ్యవసాయం, చిన్న వ్యాపారాలకు మారారు. వందలాది కళాకారులు ఉండే గ్రామాల్లో ఇప్పుడు పదుల సంఖ్యలో కూడా లేరు. ఒక్కరు కూడా కనిపించని ఊళ్లు ఉన్నాయి.

పగటి వేషాల సంప్రదాయాన్ని కాపాడాలి

పగటి వేషాలు కేవలం వినోదం కాదు. సామాజిక దర్పణం, చారిత్రక వారసత్వం. దాదాపుగా 80కి పైగా జానపద కళలు మన దగ్గర అంతరించిపోతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. ప్రభుత్వం, సాంస్కృతిక సంస్థలు ప్రత్యేక వేదికల ద్వారా ఈ కళలను రక్షించాలి. లేకపోతే, గడ్డిపాడు, కూచిపూడి వంటి ప్రాంతాల సంప్రదాయం గ్రంథాల్లోనే మిగిలిపోతుంది. వీధుల్లో మాయమౌతున్న పగటి వేషాల సంస్కృతిని తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సీఎం చంద్రబాబుకు 'విజయవాడ ఉత్సవ్' ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు

సీఎం, డిప్యూటీ సీఎంలకు 'విజయవాడ ఉత్సవ్' ఆహ్వానం



వన్‌టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : 'విజయవాడ ఉత్సవ్'కు విచ్చేయవలసిందిగా కోరుతూ శుక్రవారం విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ప్రముఖ వ్యాపారవేత్త, ముత్తవరపు మురళీకృష్ణ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఉమ్మడి కృష్ణాజిల్లా ఎమ్మెల్యేలతో కలిసి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దే రామ్మోహన్, వసంత కృష్ణప్రసాద్, బోడె ప్రసాద్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు పాల్గొన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు విజయవాడ ఉత్సవ్ కమిటీ సభ్యులు ఎంపీ కేశినేని శివనాథ్, ముత్తవరపు మురళీ కృష్ణ శుక్రవారం ఆయన ఛాంబర్‌లో కలిసి విజయవాడ ఉత్సవ్‌కు ఆహ్వానించారు.

పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌లకు దసరా ఉత్సవాలకు ఆహ్వానం



వన్‌టౌన్ : ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్‌లకు శుక్రవారం దుర్గగుడి ఈవో శీనానాయక్ దేవస్థానం అర్చక బృందంతో కలిసి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారికి అమ్మవారి ప్రసాదం, శేష వస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

కనకదుర్గమ్మ సేవలో ఎంపీ కేశినేని శివనాథ్

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను శుక్రవారం ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) విజయవాడ ఉత్సవ సభ్యులు ముత్తవరపు మురళీకృష్ణ తదితరులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా 'విజయవాడ ఉత్సవ్' ఆహ్వాన పత్రికను అమ్మవారి చెంత ఉంచారు. దసరా, విజయవాడ ఉత్సవ్ విజయవంతం కావాలని కోరారు. అనంతరం కెనాల్ రోడ్డులోని విఘ్నేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ తదితరులు ఉన్నారు.



దసరా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

దసరా ఏర్పాట్లపై అధికారుల పరిశీలన

ఇంద్రకీలాద్రి : దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ దుర్గగుడి ఈవో శీనానాయక్, ఈఈ కోటేశ్వరరావు తదితరులతో కలిసి శుక్రవారం దసరా మహోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈనెల 22 నుంచి దసరా ఉత్సవాలు మొదలు కానున్నాయి. సిబ్బందిని అప్రమత్తం చేసి, దిశా నిర్దేశం చేశారు.

భక్తులకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్ లక్ష్మీశ

భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. దసరా మహోత్సవాలకు నిరంతర పర్యవేక్షణ క్రమంలో ఆయన శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. హోల్డింగ్ పాయింట్లతో పాటు కేశఖండనశాల, స్నానఘట్టాలు, క్యూ లైన్లు, పార్కింగ్, భద్రత క్షుణ్ణంగా పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిరంతర పర్యవేక్షణతో ఎక్కడ ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తక్షణం పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అమ్మవారి దర్శనం, నగర పర్యటన మధురానుభూతులను మిగిల్చేలా ఈసారి ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ తెలిపారు.

ఉమ్మడి జిల్లా వినియోగదారుల కమిషన్ అదనపు బెంచ్ అధ్యక్షుడిగా పద్మారెడ్డి



విజయవాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వినియోగదారులు కమిషన్ విజయవాడ అదనపు బెంచ్ అఫిషియేట్ అధ్యక్షుడిగా నందిపాటి పద్మారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నంలోని వినియోగదారుల కమిషన్ బెంచ్ నుంచి విజయవాడ అదనపు బెంచ్‌కు పద్మారెడ్డి బదిలీ అయ్యారు. ఆయనకు విజయవాడ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు నేలపూడి చిరంజీవి, సభ్యులు వెంకట రమణ, శశికళ అభినందనలు తెలిపారు.

గతం కంటే ఘనంగా ఉత్సవాలు

- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో జరగనున్న దసరా ఉత్సవాలు గతంలో కంటే ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా మహోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం మోడల్ గెస్ట్‌హౌస్‌లో మంత్రుల బృందం సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో దేవదాయమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, హోంమంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సమాచార పౌరసంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, దుర్గగుడి ఈవో శీనానాయక్ పాల్గొన్నారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించి ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. అధునాతన క్యూలైన్లు, హోల్డింగ్ ఏరియాలు, తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, భక్తుల భద్రత, స్నానఘాట్ల వద్ద ఏర్పాట్లు, ప్రసాదం పంపిణీ, అన్న ప్రసాదం, కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు, ప్రోటోకాల్ దర్శన సమయాలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం దేవదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ సంతృప్తికరంగా అమ్మవారి దర్శన భాగ్యం కల్పించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. వీఐపీ, వీవీఐపీ దర్శనాలను తగ్గిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ప్రోటోకాల్ పరిధిలోకి వచ్చే ప్రముఖులకు మాత్రమే అంతరాలయ దర్శనం కల్పిస్తామన్నారు. రిఫరెన్స్ లేఖలపై వచ్చేవారు బంగారు వాకిలి నుంచి అమ్మవారిని దర్శనం చేసుకోవాలన్నారు. ఉత్సవాలలో అన్ని రోజులు రూ.500 టికెట్‌ను రద్దు చేశామన్నారు. మూలానక్షత్రం, విజయదశమి పర్వదినాల రోజులలో పూర్తిగా ఉచిత దర్శనాలే ఉంటాయన్నారు. మూలా నక్షత్రం రోజున సీఎం చంద్రబాబు అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహకరించాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కోరారు. సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎమ్మెల్యేలు గద్దే రామ్మోహన్ రావు, సుజనా చౌదరి, బొండా ఉమామహేశ్వరరావు, ముఖ్య ఉత్సవ అధికారిణి డి.భ్రమరాంబ, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, తదితరులు పాల్గొన్నారు.



దసరా ఏర్పాట్లపై మాట్లాడుతున్న మంత్రుల బృందం

విజయవాడ, గుంటూరు రోడ్ల టెండర్లు రద్దు

- సీఆర్డీఏ చర్యతో కంగుతిన్న కాంట్రాక్టు సంస్థలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడ - గుంటూరు నగరాల రోడ్ల అభివృద్ధి పనుల టెండర్ల విషయంలో సీఆర్‌డీఏ వ్యవహరిస్తున్న తీరు తీవ్ర వివాదానికి దారితీస్తోంది. ఇప్పటికే విజయవాడలోని మూడు ప్రధాన రోడ్ల టెండర్లను రద్దు చేసిన సీఆర్‌డీఏ శుక్రవారం గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు మూడో దశ విస్తరణ పనులను కూడా రద్దు చేసింది. విజయవాడలో మూడు రోడ్ల పనులకు టెక్నికల్ బిడ్లను తెరవకుండా రద్దు చేస్తే.. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు విస్తరణ పనులు మాత్రం టెక్నికల్ బిడ్లు పిలిచినప్పటికీ రద్దు చేయటం గమనార్హం. ఇన్నర్ రింగ్ రోడ్డు విస్తరణ పనుల టెండర్లలో పాలు పంచుకున్న ఆరు కాంట్రాక్టు సంస్థలకు టెండర్‌ను రద్దు చేస్తున్నట్టుగా శుక్రవారం సీఆర్‌డీఏ ఈ - మెయిల్ పంపింది. కోర్టుకు వెళతామని కాంట్రాక్టు సంస్థలు చేసిన హెచ్చరికలను కూడా సీఆర్‌డీఏ పట్టించుకోలేదు. సీఆర్‌డీఏ పరిధిలోని గుంటూరులో ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ - 3 పనులను రూ.34 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. జేకేసీ కాలేజీ (స్వర్ణభారతినగర్) నుంచి పెదపలకలూరు వరకు రోడ్డును విస్తరించేందుకు సీఆర్‌డీఏ ఆగస్టు నెలలో టెండర్లు పిలిచింది. ఆగస్టు 7వ తేదీ సాయంత్రం టెక్నికల్ బిడ్లను తెరిచారు. మొత్తం ఆరు సంస్థలు పాలు పంచుకున్నాయి. యూబీఎస్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్, ఎస్‌సీసీ లిమిటెడ్, భవానీ కన్‌స్ట్రక్షన్స్, బీఎస్ఆర్ ఇన్ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్, మాధవి ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్స్, శ్రీసాయినాథ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు టెండర్లలో పాలుపంచుకున్నాయి. మరుసటి రోజు ఆగస్టు 8వ తేదీన ఫైనాన్షియల్ బిడ్లను తెరవాల్సి ఉండగా.. అప్పటి నుంచి వాటిని ఓపెన్ చేయటం లేదు. ఫైనాన్షియల్ బిడ్లలో ఎల్-1 గా నిలిచిన సంస్థకు పనులను అప్పగించాల్సి ఉంటుంది. ఫైనాన్షియల్ బిడ్లనే ఓపెన్ చేయకపోతే ఎవరు ఎల్-1గా నిలిచారో తెలియదు. కాంట్రాక్టు సంస్థలు అభ్యంతరాలు తెలిపితే గడువు పొడిగించవచ్చు. కాంట్రాక్టు సంస్థల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. అంతకు ముందు ప్రీబిడ్ మీటింగ్‌లో కాంట్రాక్టు సంస్థల నుంచి కూడా ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. అసలు కాంట్రాక్టు సంస్థలే ముందుకు రాకపోతే ఆపారనుకోవచ్చు. టెక్నికల్ బిడ్లలో ఆరు సంస్థలు పాలు పంచుకున్నాయని తెలుస్తూనే ఉంది. ఇలాంటపుడు ఫైనాన్షియల్ బిడ్లను తెరిస్తే సరిపోతుంది. ఫైనాన్షియల్ బిడ్లను తెరవకుండా గడువుల మీద గడువు పొడిగిస్తూ అర్ధంతరంగా శుక్రవారం రద్దు చేసింది. రద్దు చేస్తున్నట్టు సమాచారం ఇచ్చిన గంటలోనే ఆయా కాంట్రాక్టు సంస్థలు ఈఎండీలు, ఇతర చార్జీల కింద చెల్లించిన డబ్బును సీఆర్‌డీఏ రిఫండ్ చేసింది. ఇంత వేగంగా కాంట్రాక్టర్లు డబ్బును రిఫండ్ చేయటం వెనుక.. కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయిస్తారేమోనన్న ఉద్దేశ్యం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. విజయవాడలో మూడు రోడ్డు పనుల టెండర్లకు వస్తే వాటికి టెక్నికల్ బిడ్లనే తెరవలేదు. టెక్నికల్ బిడ్లను తెరవకపోవటం వల్ల కాంట్రాక్టు సంస్థలు కోర్టుకు వెళ్లే అవకాశం ఉండదు. రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) పరిధిలో ప్రస్తుతం విజయవాడ, గుంటూరు నగరాలు ప్రధానమైనవి. ఈ రెండు ప్రాంతాల అభివృద్ధి పనుల విషయంలో సీఆర్‌డీఏ అధికారులు ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారో అర్థం కావటం లేదు. రెండు నగరాలలో కూడా ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. అత్యవసరంగా చేపట్టాల్సిన రోడ్డు ప్రాజెక్టుల విషయంలో టెండర్ల గడువు పెంపు, రద్దుల కారణంగా మరింత జాప్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పెద్ద కాంట్రాక్టర్ల కోసమే టెండర్లను రద్దు చేశారని చిన్న కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.



ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, స్టాల్ ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

దేశంలోనే అత్యంత సుందర నగరంగా అమరావతి : ఎంపీ శివనాథ్

లబ్బీపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అమరావతి రాజధాని దేశంలోనే అత్యంత సుందర నగరంగా మారనుందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఎ కన్వెన్షన్‌లో నరెడ్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమరావతి ప్రాపర్టీ షోను శుక్రువారం ఆయన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మంత్రి నారాయణతో కలిసి ప్రారంభించారు. సొంతింటి కలను సాకారం చేసుకోవాలనే వారికి ఇది అద్భుతమైన వేదికగా ఉపయోగపడుతుందన్నారు. అమరావతి నగరం భవిష్యత్తులో భారతదేశంలోనే అత్యంత సుందర నగరంగా మారబోతోందని, ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టడం వలన మంచి భవిష్యత్తు లభిస్తుందని అన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ అమరావతి ప్రాపర్టీ షో కేవలం ప్రదర్శన మాత్రమే కాదని, రాజధాని భవిష్యత్ ఎలా ఉండబోతోందో చూపిస్తుందన్నారు. రియల్ ఎస్టేట్ అంటే కేవలం భవనాలు కాదని, ఉపాధి కల్పిస్తుందని, ఆర్థిక వృద్ధికి ఊత మిస్తుందన్నారు. అనంతరం ఆయన మా లక్ష్మీ గ్రూప్ స్టాల్‌ను ప్రారంభించారు. నరెడ్కో ఏపీ ప్రెసిడెంట్ గద్దె చక్రధర్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పరుచూరి కిరణ్, ఏపీ సెక్రటరీ మామిడి సీతారామయ్య, సెంట్రల్ జోన్ ప్రెసిడెంట్ సందీప్ మండవ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రెరా చైర్మన్ శివారెడ్డికి అభినందనల వెల్లువ

పెనమలూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థిరాస్థి వ్యాపార ప్రాధికార సంస్థ(ఏపీ రెరా) చైర్మన్‌గా నియమితులయిన శివారెడ్డికి మాజీ కేంద్రమంత్రి, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తాడిగడపలోని ఎమ్మెల్యే సుజనాచౌదరి క్యాంపు కార్యాలయంలో చైర్మన్ శివారెడ్డి ఇరువురు ఎమ్మెల్యేలను మర్యాదపూర్వకంగా కలిశారు. శివారెడ్డి సారథ్యంలో ఏపీ రెరా అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు.

విజయ పాలు, పాల పదార్థాల ధరల తగ్గింపు

చిట్టినగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పాల ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గించడంతో కృష్ణామిల్క్ యూనియన్ జీఎస్టీ వర్తించే పాలు, పాలపదార్థాల ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసి తగ్గిన రేట్లను ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం దేశ పాడి రంగానికి మేలు చేస్తుందన్నారు. తగ్గిన ధరలను సెప్టెంబరు 22 నుంచి అమ లు చేయాలని కృష్ణా మిల్క్ యూనియన్ నిర్ణయం తీసుకుందని చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. యూహెచ్‌టీ పాలు (టెట్రా ప్యాక్) లీటరుకు రూ.5, పన్నీరు కిలో కు రూ.20, వెన్న కిలోకు రూ.30, నెయ్యి కిలోకు రూ.30, ఫ్లేవర్డ్ మిల్క్ లీటరకు రూ.5 తగ్గిస్తున్నట్టు పేర్కొన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ దక్షిణ భారతదేశం లోనే ఆదర్శవంతమైన పాడి సహకార సంస్థగా 1.50లక్షల పాడి రైతు కుటుంబాల శ్రేయస్సుతోపాటు ఆరు దశాబ్దాలుగా వినియోగదారులకు నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను అందిస్తోందని మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు.

గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గాంధీనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే నిరసన కార్యక్రమాలు చేపడతామని ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎండీ.పాషా స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని గురువారం సచివాలయంలో కలిసి ముందస్తు నోటీసు అందజేశారు. సచివాలయ ఉద్యోగులకు వలంటీర్ల విధుల నుంచి విముక్తి కలిగించాలని, మాతృశాఖ, ఇతర శాఖల్లో విలీనం చేయాలని మంత్రిని కోరారు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఆరేళ్ల ఒకే క్యాడర్‌లో పని చేసిన ఉద్యోగులకు స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కల్పించి పే స్కేల్ అమలు చేయాలన్నారు. పెన్షన్ నిలుపుదలకు సంబంధించి జేఏసీ పిలుపు ఇవ్వలేదని మంత్రికి స్పష్టం చేశారు. ఆయా అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారని పాషా తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విప్పర్తి నిఖిల్‌కృష్ణ, రాష్ట్ర కన్వీనర్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్ చొరవ.. కవలల వైద్యానికి 12 లక్షల ఎల్‌వోసీ

అవనిగడ్డ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డకు చెందిన కనుమూరి నాగ శ్రీనివాసరావు దంపతులకు కవలలు నెలలు నిండకుండా జన్మించగా, వారి ఆరోగ్యానికి మంత్రి నారా లోకేష్ చొరవతో రాష్ట్ర ప్రభుత్వం సాయమందించింది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కనుమూరి నాగశ్రీనివాసరావు దంపతులకు కలిగిన కవల పిల్లలు ఎదుర్కొంటున్న ఆరోగ్య ఇబ్బందుల గురించి ప్రభుత్వానికి నివేదించగా, వెంటనే స్పందించి నారా లోకేశ్ చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీసింది. అంకూర్ ఆసుపత్రిలో ఈనెల 13న నెలలు నిండకుండా జన్మించగా, వారి ఆరోగ్య పరిస్థితి విషమించటంతో ఎనికేపాడులో అనుషై బేబీ ఆసుపత్రికి తరలించగా, వైద్యం ఖర్చు భారం కావటంతో నాగ శ్రీనివాసరావు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ద్వారా సాయం కోసం ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు వారి ఆరోగ్య పరిస్థితి వివరించగా, శుక్రవారం చిన్నారుల వైద్యం కోసం రూ.12 లక్షల ఎల్‌ఓసీని ప్రభుత్వం జారీ చేసింది. చిన్నారులు ఇన్‌సెంటివ్ కేర్‌లో చికిత్స పొందుతున్నారని, వెంటనే స్పందించి సహకారం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌లకు చిన్నారుల తండ్రి కనుమూరి నాగ శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

మచిలీపట్నంలో ఉద్రిక్తత

(5వ పేజీ తరువాయి)

మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు తదితరులు రాడార్ కేంద్రానికి చేరుకున్నారు. రాడార్ కేంద్రం వద్ద పోలీసులు పెద్ద ఎత్తున బారికేడ్లు పెట్టడంతో పోలీసులు, నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. వైసీపీ శ్రేణులు ఒక్కసారిగా దూసుకురావడంతో తోపులాట జరిగింది. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం వైసీపీ నాయకులు రోడ్డుపై బైటాయించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మీడియాతో వైసీపీ నాయకులు మాట్లాడారు. సీఎం చంద్రబాబు మెడికల్ కళాశాలలను ప్రైవేటు వారికి అప్పచెబితే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని మాజీ మంత్రి పేర్ని నాని హెచ్చరించారు. ప్రజా ఉద్యమాలు చేస్తుంటే పోలీసులతో అడ్డుకోవడం సబబు కాదన్నారు. వైసీపీ హయాంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన కళాశాలల్లో ఇప్పుడు తరగతులు నడుస్తున్నాయన్నారు. చంద్రబాబు హయాంలో ఎన్ని మెడికల్ కళాశాలలు వచ్చాయో, జగన్ హయాంలో ఎన్ని వచ్చాయో అందరికీ తెలుసన్నారు.

400 మంది వైసీపీ నేతలపై కేసు నమోదు

400 మంది వైసీపీ నాయకులపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మచిలీపట్నం నగరంలో ఆందోళనలు, ర్యాలీలు చేసేందుకు అనుమతులు లేవని పోలీసులు రెండు రోజుల ముందుగానే ప్రచారం చేశారు. అయినప్పటికీ వైసీపీ నాయకులు ర్యాలీ చేశారు. పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ర్యాలీ నిర్వహించిన వైసీపీ నాయకులు పేర్ని నాని, దేవినేని అవినాష్, ఉప్పాల రాము, పేర్ని కిట్టుతో సహా 400మందిపై కేసు నమోదు చేసినట్లు మచిలీపట్నం పోలీస్‌స్టేషన్ పోలీసులు తెలిపారు.

రూ.58.56 లక్షలు గోల్‌మాల్!

(5వ పేజీ తరువాయి)

కార్యదర్శులకు కలెక్టర్ ఇటీవల నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న 10 రోజుల వ్యవధిలో నగదు చెల్లించాలని పేర్కొన్నారు. నగదు చెల్లించకుంటే ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే శాఖాపరమైనచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పెదఅవుటపల్లి పంచాయతీలోనూ..

గతంలో పెద అవుటపల్లి పంచాయతీ ప్రత్యేక అధికారిగా కూడా ఎంపీడీవో జ్యోతి పనిచేశారు. 2018 డిసెంబరు నుంచి 2021 ఆగస్టు వరకు పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన వై.వెంకటేశ్వరరావుతో కలిసి రూ.43.84 లక్షల నిధులను పక్కదారి పట్టించినట్లు అధికారులు తమ విచారణలో తేల్చారు. ఎన్ అప్పారావుపేట పంచాయతీ నుంచి ఎంపీడీవో జ్యోతి, పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన ఎం.అమీర్ బాషా, వై.వెంకటేశ్వరరావు రూ.1.37 లక్షల నగదును దుర్వినియోగం చేసినట్లుగా నివేదికను సమర్పించారు. మూడు పంచాయతీలలో మొత్తంగా ఎంపీడీవో రూ.29.28 లక్షలు, ఇద్దరు కార్యదర్శులు రూ.29.28 లక్షల నిధులను దుర్వినియోగం చేసినట్లుగా విచారణ అధికారులు నిర్ధారించారు. కాగా, పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగ విరమణ చేసిన వై.వెంకటేశ్వరరావు ఇటీవల చనిపోయారు.

ఆక్రమణల తొలగింపు

పెనమలూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెనమలూరు జాతీయ రహదారిపై పోరంకి నుండి పెనమలూరు వరకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ నేతృత్వంలో సిబ్బంది శుక్రవారం తొలగించారు. రోడ్డు ప్రక్కన ఉన్న హోర్డింగులను పూర్తిగా తొలిగించారు. తరచూ జరుగుతున్న ఆక్రమణలను ఉపేక్షించబోమని.. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకొని భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.



ఆక్రమణలను తొలిగింపజేస్తున్న సీఐ వెంకటనారాయణ

టీడీపీ శ్రేణుల సంబరాలు



పెనమలూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్‌గా పోరంకి వాసి బొర్రా రాధాకృష్ణ(గాంధీ) ఎంపికవడంతో పోరంకిలో టీడీపీ శ్రేణుల సంబరాలు మిన్నంటాయి. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సోదరుడు సురేష్ నేతృత్వంలో అభిమానులు పోరంకి ఎన్టీఆర్ కుటీరం వద్ద కేకును కోసి పంచిపెట్టారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిలారు ఉదయ్, రామినేని శివాజీ, పున్నయ్య, టీ శ్రీనివాస్, కర్లపూడి సుబ్బారావు పాల్గొన్నారు.

వృత్తిలో అంకితభావంతో రాణిస్తేనే అవార్డులు



గన్నవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వృత్తిలో అంకితభావంతో రాణించినప్పుడే అవార్డులు లభిస్తాయని పలువురు పేర్కొన్నారు. మండలంలోని కేసరపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఇటీవల ఉత్తమ అవార్డు అందుకోగా శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షులు నీలం అశోక్ ఆధ్వర్యంలో దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు నాదిండ్ల మోహన్ మాట్లాడుతూ, అభివృద్ధి సంక్షేమానికి ప్రధాని మోదీ అధిక ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, మేడూరి శేషకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోబో ఆవిష్కరణలపై దృష్టిసారించాలి

- ముగింపు సభలో వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ వేణుగోపాల్



విజేతలకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఏవీ రత్నప్రసాద్

కానూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రోబో ఆవిష్కరణలపై దృష్టి సారిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వరంగల్ నిట్ ప్రొఫెసర్ ఎ. వేణుగోపాల్ అన్నారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి రోబోటిక్స్ పోటీలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ పరుచూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలైన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్‌లు అందజేశారు. వర్సిటీ ప్రొఫెసర్ ఏవీ రత్నప్రసాద్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రవికుమార్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్‌లు డాక్టర్ జి.ఢిల్లీబాబు, డాక్టర్ ఎం.సుమలత, డాక్టర్ బి. సుప్రజారెడ్డి, విద్యార్థి కోఆర్డినేటర్‌లు జె.తేజ అమరేశ్వర్, ఎండీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆకట్టుకున్న రోబోటిక్ వర్క్‌షాప్

సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో రెండు రోజులుగా నిర్వహించిన రోబో ఎక్స్-2025 ఆకట్టుకుంది. జాతీయస్థాయి రోబోటిక్స్ పోటీల్లో ఇన్నోవేట్, ఆటోమేట్, డామినేట్ థీమ్స్‌లో ఆరు అంశాల్లో పోటీలు నిర్వహించగా దేశంలోని పలు కళాశాలల నుంచి 70 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. అద్భుతమైన ఆవిష్కరణలతో పోటీలు ముగిశాయి. సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థుల జట్టు మిషన్ రెస్క్యూ, ప్రెసిషన్ పిక్ అండ్ ప్లేస్‌లో ప్రథమ, ఇండస్ట్రీ-4.0 ఛాలెంజ్‌లో ద్వితీయ స్థానం సాధించాయి. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థుల జట్టు రోబోవర్ చాలెంజ్‌లో మొదటి స్థానాలను కైవసం చేసుకుంది. విశాఖపట్నంలోని ఎన్‌ఎస్‌ఆర్ ఐటీ కళాశాల జట్టు అగ్రిబాట్ చాలెంజ్, ఇండస్ట్రీ 4.0 అంశాల్లో ప్రథమ బహుమతులను గెలుచుకున్నాయి. ఉషా రామా కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు అగ్రిబాట్ చాలెంజ్ అంశంలో రెండో స్థానం, నందమూరు శ్రీవాసవి విద్యార్థుల జట్టు ప్రెసిషన్ పిక్ అండ్ ప్లేస్ లో రెండో బహుమతిని సాధించాయి. పాత్ ఫైండర్ చాలెంజ్‌లో గంగూరులోని ధనేకుల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థుల జట్టు ప్రథమ స్థానాన్ని, కాకినాడ జిల్లా సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయం జట్టు ద్వితీయ స్థానం పొందాయి. ఈ పోటీలకు ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ స్పెషలిస్ట్ కె. చంద్రనీల్ న్యాయనిర్ణేతగా వ్యవహరించి మూల్యాంకనం చేశారు.





రోబో ఎక్స్ పోటీల్లో విద్యార్థులు ప్రదర్శిస్తున్న రోబోటిక్స్‌లు.. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఘనంగా రుద్రాభిషేకం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాపులపాడు మల్లికార్జునస్వామి దేవస్థానంలో దేవతామూర్తులకు శుక్రవారం త్రయోదశి సందర్భంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి, అమ్మవారికి అభిషేకాలు జరిపారు. అనంతరం నందీశ్వరస్వామికి పంచామృతాభిషేకం వేడుకగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా, సభ్యులు గూడపాటి రత్నశేఖర్, తమిరి రమేష్, కొల్లి వెంకట్రావు తదితరులు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జలవనరులను సంరక్షించుకోవాలి



ఉంగుటూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగిస్తూ జలవనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై వుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.శ్రీహరిబాబు అన్నారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పొట్టిపాడులో జలజీవన్ మిషన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.

ఘనంగా ఎంపీ బాలశౌరి జన్మదినం



పెనమలూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. జనసేన పెదపులిపాక గ్రామ అధ్యక్షురాలు మేకా స్వాతితేజ, జనసేన మండల ఉపాధ్యక్షుడు మేకా సుబ్బారావు ఆధ్వర్యంలో వణుకూరు వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కంకిపాడు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముప్పా రాజా, బోయిన రోహిణి, సుంకర శివ, బోయిన నాగరాజు, పచ్చిపాల శేఖర్, చల్లా జగదీష్, నరహరి శెట్టి పవన్, బొజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సుధాకర్ చౌదరితో పారిశ్రామికవేత్తలు

క్రిబ్‌కో చైర్మన్ సుధాకర్ చౌదరికి సత్కారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతంలోని రైతు కుటుంబం నుంచి జాతీయస్థాయిలోని సహకార సంస్థ క్రిబ్‌కో చైర్మన్‌గా వల్లభనేని సుధాకర్ చౌదరి ఎన్నిక కావడం తెలుగు ప్రజలకు గర్వకారణమని మల్లవల్లి పారిశ్రామికవేత్తలు అన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో మోహన్ స్పింటెక్స్ పరిశ్రమకు శుక్రవారం విచ్చేసిన సుధాకర్ చౌదరిని స్థానిక పారిశ్రామికవేత్తలు, సాయి కల్యాణి దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. మల్లవల్లి పారిశ్రామికవేత్తలు మురళి, జి. రవికుమార్, ఫణీంద్ర, ప్రసన్న, వంశీ తదితరుల పాల్గొన్నారు.

200 మందికి వైద్యపరీక్షలు

ఉయ్యూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చినఓగిరాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పెదఓగిరాలలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించి 200 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. సర్పంచ్ త్రిపురం లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్ శిబిరాన్ని ప్రారంభించారు.



ఎమ్మెల్యే సుజనాచౌదరితో చర్చిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

మర్యాదపూర్వక కలయిక

ఎమ్మెల్యే సుజనాచౌదరిని కలిసిన ఎంపీ కేశినేని చిన్ని

పెనమలూరు, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరిని, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తాడిగడపలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సుజనాను కలిసి వివిధ అంశాలను చర్చించారు. వారితో పాటు బీజేపీ మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, కోమటి జయరాం, ముత్తవరపు మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

ఇంద్రకీలాద్రి అభివృద్ధికి కృషి చేయండి

దుర్గగుడి నూతన చైర్మన్‌గా ఎంపికయిన బొర్రా రాధాకృష్ణ(గాంధీ) శుక్రవారం తాడిగడపలోని ఎమ్మెల్యే సుజనాచౌదరి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన చైర్మన్‌ను ఎమ్మెల్యే సుజనా అభినందించారు. అధికారులందరి సమన్వయంతో ఇంద్రకీలాద్రి అభివృద్ధికి కృషి చేయాలని, భక్తులకు మెరుగైన సేవలు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని గాంధీకి సూచించారు.



మహిళలకు చీరల పంపిణీ

ఉయ్యూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సేవా కార్యక్రమాల్లో ఉయ్యూరు ఇన్నర్‌వీల్‌క్లబ్ ముందంజలో ఉంటుందని జిల్లా క్లబ్ చైర్మన్ సి.అరుణశ్రీ ప్రస్తుతించారు. చైర్మన్ అధికార పర్యటనలో భాగంగా శుక్రవారం ఉయ్యూరులో పర్యటించి క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు నర్రా సుధారాణి అధ్యక్షతన జరిగిన క్రమంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ జూనియర్ కళాశాల విద్యార్థినులకు రూ. 5వేల నగదు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. పీడీజీ అశోక్, క్లబ్ కార్యదర్శి అన్నేరాణి, నూకల ప్రమీల, లక్ష్మీరూప, సుజాత, శ్యామల, రమా, ఉషారాణి, పద్మ సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి

ఉయ్యూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంటలు నాశనం చేసి రైతులకు నష్టం చేసే ఎలుకల నివారణ సామూహికంగా చేపట్టాలని ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పెదఓగిరాలలో శుక్రవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం సర్పంచ్ త్రిపురం లక్ష్మితో కలసి ప్రారంభించారు. మండల వ్యవసాయ అధికారి బి.నిస్సీగ్రేస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ నూరుశాతం రాయితో ఎలుకల నిర్మూలనకు ప్రభుత్వం మందు అందజేస్తుందన్నారు. పీఏసీఎస్ చైర్మన్ మున్నంగి శ్రీనివాసరెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు గుంటక నాగిరెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఉంగుటూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మంచి పోషకవిలువలు కలిగిన సమతుల ఆహారాన్ని తీసుకోవడంద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని ఐసీడీఎస్ సీడీపీవో జి.మంగమ్మ అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా పోషకాహారంపై అవగాహనా కార్యక్రమాలు మండలంలోని పెదఅవుటపల్లి, ఉంగుటూరు అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించారు. పెదఅవుటపల్లిలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీడీపీవో మాట్లాడుతూ, మనిషి శారీరక, మానసిక పెరుగుదల సక్రమంగా వుండాలంటే అన్ని పోషకాలు సరైన మోతాదులో వుండే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బి.పద్మాదేవి, ఎల్.దుర్గాదేవి సర్పంచ్‌లు బాణావతు తిరుపతమ్మ, కాటూరి వరప్రసాద్, అంగన్వాడీ కార్యకర్తలు బాలింతలు పాల్గొన్నారు.

కంకిపాడు : శిశు సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగపరుచుకోవాలని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి ప్రేమ్‌చంద్ అన్నారు. కంకిపాడు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ గర్భిణులు సకాలంలో వ్యాక్సినేషన్ చేయించుకోవాలన్నారు. డాక్టర్ సుధా ప్రసూజ, సీడీపీవో సుకన్య, సర్పంచ్ బాకి రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, శ్రీనివాస్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం : పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సీహెచ్‌వో వి.వి.కుమారి సూచించారు. మర్లపాలెం పాల కేంద్రం దగ్గరలోని అంగన్వాడీ కేంద్రంలో సుపోషిత భారత్ కార్యక్రమంలో భాగంగా బాలింతలు, గర్భిణులకు శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపద్మావతి, శ్రీనివాసరావు, రేణు రాజ్యం, సీతారామయ్య, అంగన్వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మహిళలకు ఆరోగ్యంపై అవగాహన ఉండాలని డాక్టర్ ప్రణయ్‌సాగర్ సూచించారు. కె.సీతారాంపురంలో శుక్రవారం వీరవల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వస్త్ నారీ - సశక్తి పరివార్ అభియాన్‌ను సర్పంచ్ చెన్నుబోయిన వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆప్తమాలిక్ ఆఫీసర్ ఏడుకొండలు, హెల్త్‌సూపర్‌వైజర్ శరత్‌చంద్ర, నాగలక్ష్మి, మూర్తి ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



గన్నవరం, హనుమాన్‌జంక్షన్‌లో ధర్నా నిర్వహిస్తున్న వీఆర్‌ఏలు

కొనసాగుతున్న వీఆర్‌ఏల ధర్నా

గన్నవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న వీఆర్‌ఏలను ఆదుకోవాలని ఆ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శి ఎం.పూర్ణచంద్రరావు, జి.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేస్తున్న ధర్నా శుక్రవారానికి రెండవ రోజుకు చేరింది. ఈ ధర్నాలో సంఘ జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటరత్నం, డి.అనూష, సుజాత, గీత, జోస్పిన్, సువర్ణ, స్వర్ణ, ఝాన్సీ, జ్యోతి, లక్ష్మీ, పద్మారావు పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం సంఘీభావం

హనుమాన్‌జంక్షన్: వీఆర్యేల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బాపులపాడు మండల వీఆర్వోల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గత రెండు రోజులుగా మండలంలోని వీఆర్యేలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. శుక్రవారం వీఆర్వోలు గాబ్రియేల్, సీమోను, కర్రా నాగరాజు, అనిల్, శ్రీకాంత్, బాజీ తదితరులు నిరసన శిబిరాన్ని సందర్శించి వీఆర్యేలకు సంఘీభావం తెలిపారు.

ఉయ్యూరు : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపు మేరకు ఉయ్యూరులో గ్రామ రెవెన్యూ సహాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెండోరోజు శుక్రవారం దీక్ష కొనసాగించారు. నైట్ వాచ్‌మెన్, అటెండర్ డ్యూటీలు రద్దుచేయాలని, ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నట్టు స్థానిక సంఘ నాయకులు డి.ఏడుకొండలు, సులేమాన్‌రాజు, కొడాలి రాహుల్, నాగభూషణం తెలిపారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న యాజమాన్యం, అధ్యాపకులు, అతిథులు

విద్యార్థులు సమాజ సమస్యలు పరిష్కరించే సామర్థ్యాన్ని పెంచుకోవాలి

పెనమలూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సమాజ సమస్యలు పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని ఏఐసీటీఈ డాక్టర్ చంద్రశేఖర్ బుద్ధ సూచించారు. స్థానిక గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కళాశాల, వీఆర్ ఎడ్యుకేర్ సంయుక్తంగా ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్నోవేటివ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్-2025 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, భారతదేశం ఆర్థికరంగంలో ప్రపంచంలోనే నాలుగో స్థానంలో ఉందని తెలిపారు. విద్యార్థుల స్టార్టప్‌లను ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అందిస్తోందని తెలిపారు. ఈ లక్ష్యాలను సాధించడానికి అభివృద్ధి చెందుతున్న ఎమర్జింగ్ టెక్నాలజీలను అమలు చేయడం ద్వారా విజయాన్ని సాధించవచ్చని తెలిపారు. జేఎన్టీయూ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ డీ రాజలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, సహకార పరిశోధనపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్, కార్యదర్శి ధనేకుల భవానీప్రసాద్, డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల, డీన్లు డాక్టర్ సత్యప్రసాద్, డాక్టర్ రాజేష్ గోగినేని, వీఆర్ ఎడ్యుకేర్ సీఈవో వెంకట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వెన్నుపూస అనారోగ్య సమస్యతో ఇబ్బంది పడుతున్న వీరవల్లి కి చెందిన అంకిత వైద్యఖర్చులు నిమిత్తం మానవత జంక్షన్ శాఖ సభ్యులు రూ.62 వేలు ఆర్థికసాయం అందజేశారు. శుక్రవారం స్థానిక మానవత కార్యాలయంలో బాధితురాలికి రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు చేతులు మీదుగా ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు సత్యనారాయణ, గణేష్, రామచంద్రరావు, కన్నె గంటి వెంకట సుబ్బారావు, వడ్డి రాజేశ్వరరావు, నారగాని కొండలరావు, అక్కినేని రాఘవేంద్రరావు, చలం, సుబ్బాచారి, మరీదు వెంకటస్వామి, నూకల నాగాంజనేయులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	133 , 142, 153
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

ఓటర్ల జాబితా పరిశీలన

నందివాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 2022 టూ 2025 సంవత్సరం మధ్య ఓటరు లిస్టుల పరిశీలనపై స్టేట్ నోడల్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించినట్లు మండల తహసీల్దార్ గురుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, 2022, 2025 వరకు ఓటర్ల లిస్టులు పరిశీలన 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓట్లు చేర్పించుకునే విధానం, చనిపోయిన వారి ఓట్లు తీసివేయటం, వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ కిషోర్, ఆర్ఐ గణేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

బ్యాంకర్ల వేధింపులు తాళలేక పోతున్నాం..
టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు

గుడివాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో లబ్ధిదారులను బ్యాంకర్ల వేధింపుల నుంచి కాపాడాలని, స్మార్ట్‌మీటర్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని కాలనీ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు సింగవరపు రాంబాబు తెలిపారు. శుక్రవారం గుడివాడ మండలం మల్లాయిపాలెం శివారు టిడ్కోకాలనీలో సీ 28 బ్లాక్ వద్ద అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాళాలు వేస్తామని బ్యాంకర్లు బెదిరిస్తున్నారని, రుణమాఫీ చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకర్ల వేధింపులు, దౌర్జన్యా లను ఆపాలని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిలపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి
- ఎమ్మెల్యే వెనిగండ్ల



గుడివాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గత పాలకుల అనాలోచిత విధానాలతో టిడ్కో కాలనీవాసులు పడుతున్న పాట్లు వర్ణనాతీతమని, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం టిడ్కో కాలనీలో రూ.40 లక్షల మున్సిపల్ నిధులతో నూతనంగా ఏర్పాటు చేయనున్న సబ్ మెర్సిబుల్ బోర్ల పనులకు ఎమ్మెల్యే వెనిగండ్ల భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత్తం 8 బోర్లు ఏర్పాటు చేస్తున్నామని, వచ్చే నెలలో మరో నాలుగు బోర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పారిశుధ్య సమస్య పరిష్కారంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. టిడ్కోకాలనీ సమస్యలను సీఎం చంద్రబాబు, మంత్రులు, కలెక్టర్ దృష్టికి అనేకసార్లు తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, డీఈ యమ్.శివాజీ, ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ఇంజనీర్ బాల శివాజీ, టీడీపీ నాయకులు జగన్మోహనరావు, కంచర్ల సుధాకర్, నిరంజన్, రామధేను వేణుబాబు, ఏసుపాదం, సయ్యద్ జబీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదకద్రవ్య రహిత జీవితాన్ని గడపాలి

యువత, విద్యార్థులనే వ్యత్యాసం లేకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల రహిత జీవితాన్ని గడపాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక కైకాల సత్యనారాయణ కళామందిరంలో యాహు సంస్థ, వెనిగండ్ల ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్ వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వెనిగండ్ల ఫౌండేషన్ కన్వీనర్ సుఖద మాట్లాడుతూ, భావి భారత పౌరులైన విద్యార్థులు డ్రగ్స్‌కు నో చెప్పి, జీవితానికి ఎస్ చెప్పాలన్నారు. నేటి సమాజంలో బాల్యదశలోనే కొందరు డ్రగ్స్‌కు బానిసలవు తున్నారని, వారిలో మార్పు తెచ్చేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నా మన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, సుఖద దంపతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చిన విద్యార్థులకు యాహు సంస్థ ప్రతినిధులు బహుమతులు అందించారు. సదస్సులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి టీ షర్ట్, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు రజిని, బాలాజీ, యాహు సంస్థ ప్రతినిధులు ప్రభుకాంత్, దేవరపల్లి వినయ్, రామకృష్ణ, టీడీపీ నాయకులు జగన్మోహనరావు, వెనిగండ్ల ఫౌండేషన్ డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నతశిఖారాలను అధిరోహించాలి
డీఎస్పీ ధీరజ్ వినీల్



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న డీఎస్పీ ధీరజ్‌వినీల్

గుడివాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డీఎస్పీ ధీరజ్‌వినీల్ ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ సర్వీస్ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు పలు విభాగాల్లో ప్రతిభా పోటీలను నిర్వహించారు. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ ధీరజ్‌వినీల్ విచ్చేశారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కౌన్సిలర్ గవిర్నేని బాబు శ్రీకర్, అధ్యక్షకార్యదర్శులు యలమంచిలి నాగేశ్వరరావు, జి.కిరణ్ బాబు, సభ్యులు అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, నరేష్, మారుతి కుమార్. జాస్తి ఉమామహేశ్వరరావు, తుమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్కంఠగా ఆటల పోటీలు

కూచిపూడి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మొవ్వ జడ్పీ పాఠశాలలో అండర్-14, అండర్-17 బాలికల క్రీడాపోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. జూనియర్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగగా, కబడ్డీ, ఖో-ఖో సీనియర్స్ విభాగంలో మొవ్వ జడ్పీ పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గానూ, జూనియర్స్ విభాగంలో కాజ జడ్పీ పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. వాలీబాల్ సీనియర్స్ విభాగంలో పెడసనగల్లు జడ్పీపాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గానూ, మొవ్వ జడ్పీ పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా త్వరలో జరుగనున్న డివిజన్ స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు.

కూచిపూడి అభివృద్ధిపై సమాచార సేకరణ



నాట్య పుష్కరిణిని పరిశీలిస్తున్న పర్యాటక శాఖ అధికారులు

కూచిపూడి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి గ్రామాన్ని వారసత్వ గ్రామంగా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా కలెక్టర్ డికె.బాలాజీ ఆదేశాల మేరకు శుక్రవారం పర్యాటక శాఖ అధికారులు గ్రామంలో పర్యటించి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమాచారం సేకరించారు. ఏపీ పర్యాటక శాఖ ప్రతినిధుల బృందం సాహితీ, శివ, ఇర్ఫాన్‌లు గ్రామంలో పర్యటించారు. అగ్రహారంలోగల న్యాట్యపుష్కరిణిలో నటరాజ విగ్రహంతో పాటు ఫౌంటేన్ ఏర్పాటు, గ్రామ ప్రారంభంలో పంచాయతీ కార్యాలయ సమీపంలో ఆర్చ్ ఏర్పాటు, పంచాయతీ కార్యాలయం నుంచి బాలాత్రిపుర సుందరిదేవి ఆలయం వరకు ఫుట్‌పాత్ రహదారి నిర్మాణం, పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం ఇంటి ప్రాంగణం, ఇంటిని ఆధునికరించటం, అలాగే అసంపూర్తిగా మిగిలిన నాట్య పుష్కరిణిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దే అభివృద్ధిపై పరిశీలించారు.



మొవ్వ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు



గుడ్లవల్లేరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట

సమస్యల పరిష్కారం కోరుతూ వీఆర్ఏల ధర్నా

కూచిపూడి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మొవ్వ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు రెండో రోజు ధర్నా చేపట్టారు. నైట్‌వాచ్‌మెన్, అటెండర్ డ్యూటీలు రద్దు చేయాలని, అర్హతున్న వీఆర్ఏలను వీఆర్వో లుగా పదోన్నతులు కల్పించాలని, పే స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘ అధ్యక్షుడు పి.రాజేష్‌తోపాటు వీఆర్ఏలు పాల్గొనగా, వీఆర్వోలు మద్దతు ప్రకటించారు.

గుడ్లవల్లేరు: గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం గుడ్లవల్లేరు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అర్హులైన వీఆర్ ఏలను వీఆర్వోలుగా, అటెండర్లు, డ్రైవర్లుగా, వాచ్ మెన్‌లుగా పదోన్నతులు కల్పించాలని, నామినీ వీఆర్ఏలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

విశేష అలంకరణలో బాలగణపతి

గుడివాడ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : స్థానిక 8వ వార్డులోని బాలగణపతి దేవాలయంలో గణపతి నవరాత్ర మహోత్సవాలును వైభవం గా నిర్వహించిన సందర్భంగా శుక్రవారం శాంతి నిమిత్తం భారీ అన్నసమారాధన నిర్వహించారు. విశేష అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అన్నసమారాధన ప్రారంభ నిమిత్తం స్వామి వారి రూపుతో ఏర్పాటు చేసిన మహాకుంభానికి దేవస్థాన కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, శ్రీలక్ష్మీగణపతి యువజన సంఘం, కర్ణభక్త సంక్షేమ సంఘం సభ్యులు, వర్తక సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు భౌద్ధస్తూపం వద్ద ధ్యాన-జ్ఞాన విజయోత్సవం

గుడివాడ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : స్థానిక ముబారక్ సెంటర్‌లోని భౌద్ధస్తూపం వద్ద ధ్యాన-జ్ఞాన విజయోత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షులు పొంగులేటి జయరాజు, రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు రాజకుమారిలు తెలిపారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని డా.బి.ఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ బ్రహ్మర్షి డా.పత్రిజీ గుడివాడలో అడుగుపెట్టి 27వసంతాలు పూర్తయిన సందర్భంగా జ్ఞానదాత అహమ్మద్ భాషా ఆధ్వర్యంలో ధ్యాన-జ్ఞాన విజయోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, పట్టణ సీఐలు కొండపల్లి శ్రీనివాస్, జె.ఆర్.కె హనీష్‌లు పాల్గొంటారని వారు తెలిపారు.

మేడూరు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా షరీఫ్

పమిడిముక్కల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మేడూరు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి సెక్రటరీగా షేక్ షరీఫ్‌ను నియమించినట్టు ఎంపీడీవో వి.సీతారామరాజు తెలిపారు. ఇప్పటి వరకు మేడూరు ఇన్‌చార్జ్ కార్యదర్శిగా ఉన్న కేబీవీ ఎస్ ఎం స్వామి బదులు పరిపాలన సౌలభ్యం కోసం ఆయన స్థానంలో అమీనాపురం పంచాయతీ కార్యదర్శిగా ఉన్న షరీఫ్‌కు శుక్రవారం నుంచి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పమిడిముక్కల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురజాడలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఈఈ జి.గోవిందరావు తెలిపారు.



తల్లులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ శివనాగమణి

పోషకాహారంతో ఆరోగ్యంగా పిల్లలు

పెదపారుపూడి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చినపారుపూడిలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామసర్పంచ్ నగుళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ బయట ఆహారాలు ఎక్కువగా తీసుకోకూడదని, దాని వల్ల పిల్లలు ఎక్కువగా లావు అవ్వటం, అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. వానపాములలో పోషకాహార మాసోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శివనాగమణి అధ్యక్షతన పిల్లలు ప్రతీ రోజు పాఠశాలకు వెళ్లే విధంగా తల్లిదండ్రులు చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదమద్దాలిలో అవగాహన సదస్సు

పామర్రు: మండల పరిధిలోని పెదమద్దాలి అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ విజయకుమారి మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన న్యూట్రిషన్ ఏర్పాటు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రం కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనమకూరులో డ్రెయిన్ తవ్వకాలు



తోట్లవల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పెనమకూరులో శుక్రవారం మురుగు పారుదలకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. ఆర్అండ్‌బీ రహదారి నుంచి బీసీ, ఎస్సీ కాలనీల ఏరియాల వైపు నుంచి మురుగు నడిచేందుకు ఉన్న డ్రెయినేజీలు ఆక్రమణలతో నిండిపోయాయని, ఆక్రమణలను తొలగించి డ్రెయినేజీలను తవ్వించినట్టు కార్యదర్శి బి వెంకటేశ్వరరావు తెలిపారు. చాలాకాలంగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించామన్నారు. ఇందుకోసం పోలీసు బందోబస్తు కూడా తీసుకున్నట్టు కార్యదర్శి తెలిపారు.

దేవాలయ అభివృద్ధికి విరాళాలు



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

పెదపారుపూడి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యలమర్రు సీతారామ దేవస్థానానికి గ్రామానికి చెందిన చెరుకూరి గణేష్ - సరోజిని దంపతులు ఐదు సెంట్ల స్థలాన్ని దానంగా అందజేశారు. ఈ మేరకు ఈ స్థలానికి సంబంధించిన దానపత్రాలను గ్రామస్థుల సమక్షంలో సీతారామ దేవస్థానం, అభయాంజనేయ స్వామి మండపాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సూరపనేని వెంకట సత్యనారాయణ, కమిటీ సభ్యులకు అందజేశారు. దాత అందించిన ఈ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని అభివృద్ధి కమిటీ తీర్మానించినట్లు సత్యనారాయణ తెలిపారు.

రోటరీ యువజనోత్సవాల్లో విద్యాలయ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాలయ పాఠశాల డైరెక్టర్ విజయభాస్కర్

గుడివాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రోటరీ భవన్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు ప్రతిభా పోటీల్లో విద్యాలయ విద్యార్థులు పలు పతకాలు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్ తెలిపారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లో పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల బొప్పన శాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

● రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ పోటీల్లో డా.కెకెఆర్స్ గౌతమ్ విద్యార్థులు పలు పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ యమ్.సత్యారామ్ తెలిపారు. శుక్రవారం స్థానిక పాఠశాల ఆవరణలో పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ వి.లక్ష్మీప్రసాద్, కె.జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు, అభినందించారు.

● రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ పోటీల్లో విశ్వభారతి విద్యార్థులు పలు పతకాలు సాధించినట్లు పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని పాఠశాలలో పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

● రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ పోటీల్లో విద్యావికాస్ విద్యార్థుల వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో పలు పతకాలు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు తెలిపారు. శుక్రవారం ఆయన విద్యార్థులను ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్ చాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు, వ్యాయామోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గుడివాడ రూరల్ : గుడివాడ రోటరీక్లబ్ నిర్వహించిన పోటీల్లో షైనింగ్ స్టార్ స్కూల్ విద్యార్థులు పలు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం లింగమనేని స్రవంతి, జగదీష్‌లు అభినందించారు.



గుడ్లవల్లేరు: స్థానిక ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్. గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు గుడివాడ రోటరీ క్లబ్ నిర్వహిం చిన పోటీల్లో పలు అంశాలలో పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ కుంజుమన్ తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను, పాఠశాల యాజమాన్యం, డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తిలు అభినందించారు.

సమాజంలో సహాయం అందించాలి

సమాజంలో సహాయం అవసరం ఉన్న చోటకు వెళ్లి సహాయం అందిస్తూ ప్రజాఅవసరాలను తీర్చాలని లయన్స్ జోన్ - 2 చైర్‌పర్సన్ నిమ్మగడ్డ శశికళ అన్నారు. శుక్రవారం గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జోన్ అడ్వయజరీ సమావేశం జోన్‌చైర్‌పర్సన్ నిమ్మగడ్డ శశికళ అధ్యక్షతన నిర్వహించారు. పెడన, మచిలీపట్నం, ముదినేపల్లి, ఉయ్యూరు, గుడ్లవల్లేరు లయన్స్‌క్లబ్‌ల అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారులు, డైరెక్టర్లు తమ తమ లయన్స్ క్లబ్‌లు నిర్వహించిన సేవా కార్యక్రమాలను వివరించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

చల్లపల్లి ఎంపీడీవోగా ఆనందకుమారి

చల్లపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి ఎంపీడీవోగా ఎం.ఎం.ఆనందకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కంచికచర్ల ఏవోగా పనిచేస్తున్న ఆనందకుమారి పదోన్నతిపై ఇక్కడకు ఎంపీడీవోగా వచ్చారు. చల్లపల్లిలో పనిచేసిన డాక్టర్ ఏవీ రమణ డీఎల్డీవోగా పదోన్నతి పొందారు. బాధ్యతలు స్వీకరించిన ఆనందకుమారికి కార్యాలయ సూపరింటెండెంట్ అతావుల్లా, పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ శ్యాంసన్ స్వాగతం పలికారు.



ఆనందకుమారికి స్వాగతం పలుకుతున్న అధికారులు

పాముకాటుకు నాటువైద్యం వద్దు

● డీఎంహెచ్‌వో వెంకట్రావు

అవనిగడ్డ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పాముకాటు వేస్తే సరైన సమయంలో చికిత్స చేయించుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాటు వైద్యం జోలికి వెళ్లొద్దని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి ఎ.వెంకట్రావు సూచించారు. శుక్రవారం అవనిగడ్డ 3వ సచివాలయంలో నిర్వహించిన స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాముకాటుకు గురైన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పలువురు టీబీ రోగులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. మరో 35 మంది వృద్ధులకు దోమతెరలు పంపిణీ చేశారు. టీబీ రోగులకు పౌష్టికాహారం, దోమ తెరలను ఆరోగ్య పర్యవేక్షకుడు కమ్మిలి తారక రామారావు సొంత ఖర్చులతో అందజేశారు. ఆయనను డీఎంహెచ్‌వో అభినందించారు. వైద్యులు మహేష్, రాహుల్ ప్రభాకర్, రమేష్ పాల్గొన్నారు.



పోషకాహారం అందిస్తున్న వైద్యాధికారులు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.వి.రామకృష్ణయ్య

దివ్యాంగుల సేవలో ఆనందం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సేవలో ఎంతో ఆనందం ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య అన్నారు. బుట్టాయిపేటలోని కేడీబీ మానసిక దివ్యాంగుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య సేవా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. దివ్యాంగుల శాఖ ఏడీ కామరాజు మాట్లాడుతూ.. కేడీబీ ట్రస్టు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. కేడీబీ ట్రస్టు ప్రతినిధి కాశీనాథుని అపర్ణ అధ్యక్షత వహించారు.



మైనారిటీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితుడైన హసీంబేగ్‌ను సత్కరిస్తున్న గౌసియా మసీదు కమిటీ పెద్దలు

మైనారిటీల సంక్షేమానికి కృషి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మైనారిటీల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితుడైన డాక్టర్ హసీంబేగ్ తెలిపారు. శుక్రవారం గౌసియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో హసీంబేగ్‌ను ముస్లిం మత పెద్దలు సత్కరించారు. మంత్రి కొల్లు రవీంద్ర తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హసీంబేగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు గుల్జార్, మసీదు అధ్యక్షుడు సర్దారీ, వైస్‌ప్రెసిడెంట్ హబ్బు, సెక్రటరీ ఇక్బాల్, కోశాధికారి మునీర్ పాల్గొన్నారు.



గోగినేనిపాలెంలో విద్యార్థిని లహరితో ఉపాధ్యాయులు, తలగడదీవిలో విద్యార్థిని మౌనికతో ప్రధానోపాధ్యాయుడు, పీడీ

కబడ్డీ రాష్ట్ర పోటీలకు గోగినేనిపాలెం, తలగడదీవి విద్యార్థినులు

ఘంటసాల/నాగాయలంక, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కబడ్డీ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం తాడంకి హైస్కూల్‌లో నిర్వహించిన 51వ జూనియర్ బాలికల జిల్లా కబడ్డీ ఎంపికల్లో రాష్ట్ర పోటీలకు గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని లోకం లహరి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని లంకే కృష్ణకుమారి, తలగడదీవి జడ్పీ పాఠశాల విద్యార్థిని కేసాని మౌనిక ఎంపికయిందని పీడీ టీపీఎల్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం విద్యార్థినులను ఉపాధ్యా యులు, ప్రధానోపాధ్యాయులు అభినందించారు. గోగినేనిపాలెంలో పీడీ అప్పికట్ల రామారావు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ కుంపటి జీవన్‌కుమార్ పా ల్గొన్నారు. తలగడదీవిలో మౌనికను ప్రధానోపాధ్యాయుడు బండ్రెడ్డి శివ, గ్రామ పెద్దలు అభినందించారు. ఈనెల 25 నుంచి 28 వరకు గొల్లపూడిలో జరిగే పోటీల్లో విద్యార్థినులు పాల్గొంటారని వివరించారు.

పశుపోషణలో మెళకువలు పాటించాలి

మోపిదేవి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పశుపోషణలో రైతులు తగిన మెళకువలు పాటించటం ద్వారా పెట్టుబడి తగ్గించి, లాభాలు ఆర్జించే అవకాశం ఉందని పామర్రు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ సీహెచ్ గోపీనాథ్ తెలిపారు. శుక్రవారం నాగాయితిప్ప పాల ఉత్పత్తిదారుల సంఘంలో రైతులకు బోనస్‌లు, ప్రోత్సాహక బహుమతులను ఆయన పంపిణీ చేశారు. సంఘం పరిధిలో 32 మంది సభ్యులకు రూ.25,934ల బోనస్ అందజేశారు. సంఘం పరిధిలో నూతనంగా వివాహమయిన దంపతులకు కల్యాణమస్తు పథకంలో భాగంగా బంగా రు నాణేన్ని మేనేజర్, జిల్లా బోర్డు డైరెక్టర్ వేమూరి సాయివెంకటరమణ అందించారు. సంఘ అధ్యక్షుడు యార్లగడ్డ శేషగిరిరావు, మండల పశువైద్యాధికారి డాక్టర్ నంద కిషోర్, ఏఎంపీవో సురేష్ కుమార్ పాల్గొన్నారు.



కల్యాణమస్తు పథకంలో భాగంగా దంపతులకు బంగారు నాణెం అందిస్తున్న డైరెక్టర్ సాయి వెంకట రమణ, మేనేజర్ గోపీనాథ్

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

నాగాయలంక, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వ రీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యా హ్నం 3 గంటల వరకు మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవ నిర్వహణ నాగాయలంక కమిటీ తెలిపింది. ఒమేగా అను హాస్పిటల్, కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తామని పేర్కొంది. భోగాది శివవిష్ణువర్ధన్, సబ్బినేని మహేష్ సహకారంతో మందులు అందజేస్తారని స్పష్టం చేసింది.

కల సాకారం!

● కానిస్టేబుల్‌కు ఉపాధ్యాయురాలి కొలువు

కోడూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సామాన్య రైతు కుటుంబంలో జన్మించి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించినప్పటికీ అంతటితో సంతృప్తి చెందలేదు విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన ముప్పిరిశెట్టి అనూష. ఉపాధ్యాయురాలు కావాలనే తన కలను 2025 డీఎస్సీ ద్వారా నెరవేర్చుకుంది. ఐదేళ్లుగా కానిస్టేబుల్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ లక్ష్యసాధన కోసం పట్టుదలతో శ్రమించింది. 2018లో డీఎస్సీలో ఎంపిక కాకపోయినా నిరుత్సాహపడలేదు. పట్టుదలతో లక్ష్యాన్ని సాధించింది. 2020లో పోలీసు కానిస్టేబుల్ రాత పరీక్షల్లో విజయం సాధించి కోడూరు పోలీస్ స్టేషన్‌గా సమర్థవంతంగా పని చేస్తోంది. పోలీసు ఉన్నతాధికారుల మన్ననలను పొందింది. ఈ విజయం తనకు ప్రోత్సాహం అందించిన కుటుంబసభ్యులకు అంకితమని, ఇకపై మంచి ఉపాధ్యాయురాలిగా విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దటమే తన లక్ష్యమని అనూష పేర్కొంది. అనూషను కుటుంబసభ్యులు, పోలీసు అధికారులు అభినందించారు.



ముప్పిరిశెట్టి అనూష

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు

మోపిదేవి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పర్యావరణ కాలుష్యానికి దారి తీస్తుందని, మానవ మనుగడకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని, ప్లాస్టిక్ నిషేధించటం సామాజిక బాధ్యత అని ఎంపీపీ రావి దుర్గావాణి అన్నారు. శుక్రవారం మోపిదేవిలో ప్లాస్టిక్ నిషేధంపై జడ్పీ పాఠశాల విద్యార్థులతో కలిసి అధికారులు నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ర్యాలీలో సర్పంచ్ నందిగం మేరీరాణి, హెచ్ఎం పి.జయంతి, మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకుడు పాండురంగారావు, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘంటసాలలో స్వచ్ఛతా ర్యాలీ

ఘంటసాల: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల(లాం, గుంటూరు) విద్యార్థులు స్వచ్ఛత, పారిశుధ్యం కార్యక్రమాన్ని మహాత్మాగాంధీ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన కలిగించేందుకు ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం శ్రీరంగవల్లి, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వాడకం మానేద్దామంటూ మోపిదేవిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పాత కక్షల నేపథ్యంలో దాడి

● ఒకరికి గాయాలు..ప్రభుత్వాస్పత్రిలో చికిత్స

బంటుమిల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తి గాయాలపాలై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అర్తమూరు గ్రామానికి చెందిన గుంపెన సాంబశివరావు(56) బుధవారం మధ్యాహ్నం 216 జాతీయ రహదారి సమీపాన గల పొలంలో పనులు చేసుకుంటున్నాడు. ఆ సమయం లో పాత కక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన మాకాల వెంకట్రావు, అతని కుమారులు శివరామప్రసాద్, వాసుదేవరావు దాడి చేయగా గాయాలయ్యాయి. సాయంత్రమైనా భర్త సాంబశివరావు ఇంటికి రాకపోవడం, ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో కంగారు పడిన భార్య సావిత్రమ్మ పొలం వెళ్లి చూసేసరికి గాయాలై పొలంలో పడి ఉన్నాడు. 108 వాహనం ద్వారా మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్య సేవలు అందించిన తరువాత స్పృహలోకి వచ్చిన గుంపెన సాంబశివరావు తనను గడ్డ పలుగులతో, ఇనుపరాడ్లతో వెంకట్రావు అతని కుమారులు దాడి చేశారని తెలిపారు. దీనిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై గణేష్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

మండలానికి 100 టన్నుల యూరియా

చల్లపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలానికి 100.075 మెట్రిక్ టన్నుల యూరియా శుక్రవారం వచ్చిందని ఏవో కె.మురళీకృష్ణ తెలిపారు. పురిటిగడ్డ, మేకావారిపాలెం, మంగళాపురం సొసైటీలకు 20 టన్నుల చొప్పున మొత్తం 60 టన్నులు, మండలంలోని ప్రైవేట్ దుకాణాలకు 40.075 టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. శనివారం సొసైటీల్లో యూరియా పంపిణీ చేస్తారని ఆయన పేర్కొన్నారు.

ఏఐటీయూసీ మహాసభలు విజయవంతం చేయండి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గుడివాడలో అక్టోబరు 4న నిర్వహించనున్న ఏఐటీయూసీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ తాడిపర్తి తాతయ్య పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, జిల్లా నాయకులు లింగం ఫిలిప్, నియోజకవర్గ కార్యదర్శి వంటిపులి లక్ష్మణరావు, గూడపాటి ప్రకాష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కోడూరు/ఘంటసాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోడూరు, ఘంటసాల తహసీల్దార్ కార్యాలయాల వద్ద శుక్రవారం వీఆర్వోలు ధర్నా నిర్వహించారు. పే స్కేలు అమలు చేయాలని, నామినీ వీఆర్ఏలను నియమించాలని, అర్హులకు ప్రమోషన్ ఇవ్వాలని, కారుణ్య నియామకాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కోడూరులో ధర్నాకు సీఐటీయూ నాయకుడు పోలాబత్తిన మోహనరావు, రైతు సంఘం నాయకులు ఆవుల బసవయ్య, రేపల్లె యోగప్రకాష్ మద్దతు తెలిపారు. ఘంటసాలలో వీఆర్ఏల సంఘ మండల అధ్యక్షుడు కె.మహేష్, మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, వీఆర్ఏలు బాలశ్రీను, రవీంద్ర, దేవకి, మౌనిక, సుధాకర్, అమృతం, గోవిందు, బాలశంకర్‌రావు, నాగ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



కోడూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్ఏలు



ఘంటసాల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

మత్స్యకారులకు ఆయిల్ సబ్సిడీ కార్డులు

అవనిగడ్డ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో నాగాయలంక, కోడూరు మండలానికి చెందిన 44 మంది మత్స్యకారులకు ఆయిల్ సబ్సిడీ కార్డులను ఆయన పంపిణీ చేశారు. హై స్పీడ్ డీజిల్ సబ్సిడీ కార్డుల ద్వారా వేటకు వెళ్లే మత్స్యకారులకు ప్రతీ లీటరుకు ప్రభుత్వం రూ.9 సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. మత్స్యకార జిల్లా కో-ఆపరేటివ్ డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి, ఏడీ ప్రతిభ, ఎఫ్‌డీవో సునీత పాల్గొన్నారు.



రవితేజకు నగదు అందిస్తున్న మండలి వెంకట్రామ్, జనసేన నేతలు

ఆటో ప్రమాద బాధితుడికి సాయం

చల్లపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆటోప్రమాద బాధితుడికి అండగా ఉంటామని నియోజకవర్గ యువనేత మండలి వెంకట్రామ్ భరోసా ఇచ్చారు. నారాయణరావునగర్ ఎస్టీ కాలనీకి చెందిన పారిశుధ్య కార్మికురాలు కుంబా సునీత కుమారుడు రవితేజ ఆటోప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. 23 ఏళ్ల రవితేజకు భార్య, ఏడాదిలోపు వయసున్న కుమారుడు ఉన్నారు. మార్చిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమవడంతో జనసేన మండల నేతలు విరాళాలు సమీకరించారు. పార్టీ తరపున రూ.20వేల సహాయాన్ని శుక్రవారం మండలి వెంకట్రామ్ చేతులమీదుగా బాధితునికి అందించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సహకారంతో మెరుగైన వైద్యం అందించేందుకు కృషిచేస్తామని, సీఎం రిలీఫ్‌ఫండ్ వచ్చేలా సహకారం అందిస్తామని వెంకట్రామ్ చెప్పారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, సొసైటీ ఛైర్‌పర్సన్ బొందలపాటి వీరబాబు, నేతలు తోట మురళీకృష్ణ, సూదాని నందగోపాల్, ఎం.రంజిత్, ఉరిమి మణికాంత్, ప్రెస్ పూర్ణ, అడపా రవి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

గూడూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా స్వస్థనారీ-సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, డాక్టర్ అరుణ కాత్యాయని తెలిపారు. గూడూరు పీహెచ్‌సీలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి డైరెక్టర్లు గొరిపర్తి ఫణిరాజు, రాసంశెట్టి దుర్గారావు, బేతాళ స్వామి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు తెలియజేయండి

పెడన, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 1వ వార్డు రజకులపేట, 20, 21, 22, 23 వార్డుల్లో వైఎస్సార్ కాలనీ, బ్రహ్మపురం ప్రాంతాలకు సంబంధించిన సర్క్యులేషన్ ప్యాటర్న్‌ను కంట్రీ ప్లానింగ్ రాజమండ్రి రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ అప్రూవల్ చేసి నోటిఫికేషన్‌ను జారీ చేశారని మునిసిపల్ కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి తెలిపారు. నోటిఫికేషన్‌ను మునిసిపల్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో అంటించామన్నారు. నోటిఫికేషన్‌పై ఏవైనా అభ్యంతరాలుంటే ఏడు రోజుల్లోపు ఈమెయిల్ ద్వారా కానీ, లిఖితపూర్వకంగా కానీ తెలియజేయాలని కమిషనర్ సూచించారు.

వాహనమిత్ర రిజిస్ట్రేషన్‌కు నేటితో ముగియనున్న గడువు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వాహనమిత్ర పథకం కింద కొత్తగా రిజిస్టర్ చేసుకునే వారికి శనివారం కూడా అవకాశం కల్పించినట్టు తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. అర్హత ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దేవరపల్లి సురేష్‌బాబుకు మ్యాన్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డు

చల్లపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సంఘ నేతగా, సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబుకు డాక్టర్ దాసరి నారాయణరావు స్మారక మ్యాన్ ఆఫ్ హ్యూమానిటీ అండ్ ఎక్స్‌లెన్స్ 2025 అవార్డును తెలంగాణకు చెందిన ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ అందించింది. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఆలూరి విల్సన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఇందిర అవార్డు అందించి సత్కరించారు.

పీఎంపీ, ఆర్ఎంపీల జేఏసీ సమావేశం విజయవంతం చేయండి

గూడూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పీఎంపీ, ఆర్ఎంపీలకు ప్రభుత్వ గుర్తింపు కావాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ఎస్ఏసీ కల్యాణ మండపంలో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి కృష్ణాజిల్లాలోని సభ్యులకు ఆర్ఎంపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బి.వెంకటరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం పెడన ఏరియా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎంపీడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రాంబాబు, జిల్లా ట్రెజరర్ కె.రంగారావు, కార్యదర్శి ఎండీ బషీర్ పాల్గొన్నారు.

రేపు ప్రపంచ శాంతి దినోత్సవం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న ప్రపంచ శాంతి దినోత్సవంలో అందరూ పాల్గొనాలని విద్యాలయం నిర్వాహకురాలు భారతి పిలుపునిచ్చారు. కళాశాల విద్యార్థులతో శాంతి దినోత్సవం జరుపుతామన్నారు.

గొర్రెకు అరుదైన శస్త్రచికిత్స

ఘంటసాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అరుదైన వ్యాధితో పడుతున్న గొర్రెకు శస్త్ర చికిత్స చేసి పశువైద్యాధికారి ప్రాణాలు కాపాడారు. శ్రీకాకుళం వెటర్నరీ డిస్పెన్సరీలో ఈ ఘటన శుక్రవారం జరిగింది. కొడాలి గ్రామానికి చెందిన డొక్కు. సాంబశివరావుకు చెందిన గొర్రె ప్రసవ సమయంలో డిస్టోసియా వ్యాధి కారణంగా ప్రసవ నొప్పితో బాధపడుతుంటే వైద్యుడు దేవిన హరీష్ అత్యవసర సిజేరియన్ ఆపరేషన్ చేసి, గొర్రె ప్రాణాన్ని కాపాడారు. అందుకోసం పిండాన్ని తొలగించి అత్యంత కిష్టమైన ఆపరేషన్‌ను చేశారు. గతంలోనూ మూగ జంతువులకు శస్త్ర చికిత్స చేసి ఆయన ప్రాణాలను కాపాడారు.



శస్త్రచికిత్స చేసి గొర్రె ప్రాణాన్ని కాపాడిన పశువైద్యాధికారి హరీష్

22 నుంచి పైడమ్మ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు

పెడన, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పైడమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని దేవస్థానం ఈవో కృష్ణారావు తెలిపారు. అమ్మవారిని 22న బాలా త్రిపుర సుందరీదేవి, 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న ఇష్టకామేశ్వరీదేవి, 26న మహాలక్ష్మి, 27న లలితాదేవి, 28న పరాశక్తి దేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు 1న మహాలక్ష్మీదేవి, 2న రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆయన వివరించారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

మచిలీపట్నం టౌన్: ఈనెల 22 నుంచి కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలని దేవస్థానం కార్యదర్శి మోటమర్రి బాబాప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను పాలకవర్గ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యదర్శి సామా లక్ష్మీకాంతారావు, సహాయ కార్యదర్శి బైసాని హయగ్రీవరావు, కోశాధికారి ఉడత్తు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోడూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ డి.కృష్ణ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ మెయింటెనెన్స్ కారణంగా ఇరాలి ద్వారక, ఊటగుండం, రామకృష్ణాపురం, పాత ఉపకాలి, సంగమేశ్వరం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

